క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



హరిబాబు కుటుంబాన్ని పరామర్శించిన గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దకొత్తపల్లి పంచాయతీ కొత్తూరుపేట వైఎస్సార్ సీపీ కార్యకర్త బగ్గు హరిబాబు మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈయనతో పాటు ఎంపీటీసీ జనపాల భానోజీరావు, మాజీ సర్పంచ్ గట్టెం ఈశ్వర్, సత్యనారాయణ, నాయకులు గొర్లె సూరీడు, బగ్గు వేణు, బుజ్జి, జాజిమొగ్గల గోవిందరావు, బగ్గు భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న తహశీల్దార్ చక్రవర్తి

గార: తెలుపు రేషన్ కార్డుదారులందరూ ఏప్రిల్ నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తహశీల్దార్ ఎం.చక్రవర్తి అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో సివిల్ సప్లయ్స్ డీటీ ఎస్.చక్రవర్తితో కలిసి రేషన్ డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. వృద్ధులు, చిన్నారులకు ఈకేవైసీ చేయడంపై పలు సూచనలు చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు అన్ని సచివాలయాల పరిధిలో బయోమెట్రిక్ అప్‌డేట్ కానివారు ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. అనంతరం డీలర్ వద్ద ఈ పాస్ మిషన్‌లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



నారాయణపురం హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల మండలానికి సాగునీరు అందించే నారాయణపురం కుడికాలువ సమస్య పరిష్కరించి ఖరీఫ్‌కు సజావుగా నీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం నారాయణపురం కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపురం సాగునీటి ప్రాజెక్టు ఉపాధ్యక్షులు పంచిరెడ్డి కృష్ణారావు, నాయకులు బెండు మల్లేసు, గాలి వెంకటరెడ్డి, చౌదరి అవినాష్, సంపతరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న గ్రంథాలయ పునర్వికాస సభ

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలో ఈ నెల 27న రాష్ట్ర స్థాయి గ్రంథాలయ పునర్వికాస సదస్సు నిర్వహిస్తున్నట్లు అరసం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో జరిగే ఈ సభలో కవులు, కళాకారులు, ప్రచురణ సంస్థల ప్రతినిధులు వివిధ అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు



విత్తన కిట్లు తయారు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్‌ఎఫ్‌ఏపీసీటీ శివరామకృష్ణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. శనివారం సంతవురిటి రైతు సేవా కేంద్రం వద్ద పీఎండీఎస్ 200 వందల కిట్లను తయారీ చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలతో సాగు చేస్తే రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శిరా లక్ష్మి, మాస్టర్ ట్రైనర్ టి.కృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి సువ్వాడ సంతోషికుమారి, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ప్రమీల, హిమబిందు, రాజారావు, జగదీష్, రాంబాబు, శివ పాల్గొన్నారు.

సండే స్పెషల్



శ్రీకాకుళంలో మట్టి కుండలు విక్రయం

మట్టి కుండ.. ఆరోగ్యానికి అండ!

- పేదోడి ఫ్రిజ్‌లకు గిరాకీ
- వేసవి దృష్ట్యా కొనేందుకు మొగ్గుచూపుతున్న ప్రజలు
- నగరంలో వెలుస్తున్న తాత్కాలిక షాపులు

శ్రీకాకుళం: ఇప్పుడైతే నీటిని నిల్వ చేసుకోవడానికి రకరకాల పాత్రలు, స్టీల్, ప్లాస్టిక్ బిందెలను ఉపయోగిస్తున్నారు కానీ ఒకప్పుడు అందరూ మట్టి కుండల్లోనే నీటిని నిల్వ చేసుకునేవారు. కాలక్రమేణా ఆధునిక ప్రపంచంలో మట్టి పాత్రల వినియోగం బాగా తగ్గింది. అయితే మట్టి కుండలో నీటిని తాగితే మంచిదని, రక్త ప్రసరణ పెరిగి ఉత్సాహంగా ఉంటారని కొందరు వైద్య నిపుణులు చెబుతుండటం, కుండలో నీరు తాగినప్పుడు వేసవిలో ఉపశమనం కలుగుతుండటంతో ప్రస్తుత సీజన్‌లో కుండలోని నీటిని తాగేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. దీంతో పేదోడి ఫ్రిజ్‌కు డిమాండ్ పెరిగింది.

మండుతున్న ఎండలు..

రోజురోజుకూ ఎండ, ఉక్కపోత తీవ్రత తీవ్రరూపం దాలుస్తున్నాయి. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు బయటకు రావడానికి కూడా సాహసం చేయడం లేదు. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా పిలువబడే మట్టికుండలకు గిరాకీ పెరిగింది. చల్లటినీటి కోసం చాలామంది మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. ఒకప్పుడు ఇంట్లో చేసే వంటలకు సైతం మట్టి పాత్రలనే ఉపయోగించేవారు.

తర్వాత సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మట్టిపాత్రల వినియోగం కనుమరుగైంది ఈ క్రమంలో గ్రామాల్లో కుమ్మరి కులస్తులకు చేతినిండా పని లేకుండా పోయింది. నేటి ఆధునిక కాలంలో స్టీల్ పాత్రలు, రైస్ కుక్కర్లు, తదితర పాత్రల్లో మాత్రమే ప్రజలు వంట చేసుకుంటున్నారు. దీంతో అనేక రుగ్మతలకు లోనవుతున్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆరోగ్య స్పృహ పెరగడంతో మళ్లీ నాటి మట్టి పాత్రలపై వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో మట్టి పాత్రలకు క్రేజ్ పెరిగింది. మట్టి పాత్రల వినియోగం మంచిదని పలువురు నిపుణులు తెలుపుతుండటంతో వాటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కుండ నీటికే మొగ్గు..

ఇన్నాళ్లు బిందెలు, ఫ్రిజ్ నీళ్లకే అలవాటు పడినప్పటికీ.. వేసవిలో మాత్రం చాలామంది కుండనీటికి మొగ్గు చూపుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లి ఇంటికి చేరిన ప్రజలు దాహం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటికుండలో నీటినే తాగుతున్నారు. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నప్పటికీ కుండలను కొనుగోలు చేస్తున్నారు. మట్టి కుండల సైజును బట్టి రూ.200 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు.

ప్రోత్సాహమేదీ?..

కుండలకు మార్కెట్‌లో మంచి ధర ఉన్నా వాటిని తయారు చేసేందుకు ఖర్చు ఎక్కువవుతోంది. కుండలు తయారు చేసేందుకు కుటుంబమంతా కష్టపడాలి. అయినా చేసిన పనికి ఫలితం దక్కడంలేదని కుమ్మరి కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కులవృత్తులపై ఆధారపడే వారిని ప్రోత్సహించి ఉపాధి కల్పించాలని కోరారు.

వేసవిలోనే గిరాకీ..



వేసవికాలంలో కుండలకు గిరాకీ పెరుగుతోంది. మట్టితో తయారు చేసే పాత్రలను వినియోగించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి తప్ప మిగతా సమయాల్లో మాత్రం ఆశించిన మేర అమ్మకాలు జరగడం లేదు. ప్రభుత్వం ప్రోత్సహించాలి.

– రాజేశ్వరి, పొన్నాడ

ప్రయోజనమే..



ఫ్రిజ్ నీరు కంటే కుండ నీరు తాగడం ఉత్తమం. వేసవిలో దాహార్తి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఫ్రిజ్‌లో బాగా చల్లటి నీరు తాగడం వల్ల కొంతమందికి సమస్యలు ఎదురయ్యే అవకాశముంది. కుండ నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజకరమే తప్పా హాని లేదు.

– డాక్టర్ సుజాత, శ్రీకాకుళం

కానరాని నాణ్యత



ఎచ్చెర్ల నుంచి కొయ్యాం, కుప్పిలి, బడివానిపేట గ్రామాల వైపు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత కరువైంది. తారు సక్రమంగా వినియోగించకపోవడం వల్ల రోడ్డుకు ఇరువైపులా పిక్కలు తేలుతున్నాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఆదమరిస్తే అంతే..



లావేరు మండలం సుభద్రాపురం జంక్షన్ వద్ద చీపురుపల్లి వెళ్లే రహదారి మలుపు వద్ద రోడ్డు మధ్యలో కాలువ పలక ఉడిపోయింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి పలకను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

గృహ నిర్మాణాలకు మోక్షమెప్పుడో?



ఎచ్చెర్ల, ఎస్ఎస్ఆర్‌పురం, అజ్జరాం గ్రామాల లబ్ధిదారులకు జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు అందజేశారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవటం, ఒక్కసారిగా ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగటం వంటి కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో కాలనీల్లో ఇళ్లు అసంపూర్తిగా కనిపిస్తున్నాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



లోగోను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వివేకానంద, నిర్వాహకులు

శ్రీకాకుళం అర్బన్: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. నగరంలోని ఫ్లెక్స్ జిమ్‌లో శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా లోగోను శనివారం ఆవిష్కరించారు. అనంతరం జూన్ 15న నిర్వహించనున జిల్లాస్థాయి బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం జిమ్‌ను ఏర్పాటు చేసి వందలాది మందికి వ్యామామంలో తర్ఫీదునిస్తున్న గౌరీశంకర్‌ను అభినందించారు. అనంతరం శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్(ఎస్‌బీఏ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మాన గౌరీశంకర్, ఉపాధ్యక్షుడిగా ఆర్.ఢిల్లీశ్వరరావు, సెక్రటరీగా బలగ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా పైడి రాజు, ట్రెజరర్‌గా సాయికిరణ్, జాయింట్ సెక్రటరీ–2గా దేవీప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మణికుమార్, సలహాదారులుగా ఆకుల కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వడ్డి కాంతారావు, రాయితీ చంద్రశేఖర్, పైల చంద్రశేఖర్, బూర్లె అప్పారావు, చంటి, పాత్రో, సతీష్, రామయ్య, పి.రాజు, ధనాల చిట్టిబాబు, జాఫర్, నాని, వాసు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి



పౌష్టికాహార ప్రదర్శన

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎందువ గ్రామ సర్పంచ్ అల్లు జోగినాయుడు అన్నారు. శనివారం జి.సిగడాం అంగన్‌వాడీ కేంద్రంలో గెద్దకంచరాం, ఎందువ, నర్సింహంపురం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న పలు వస్తువులతో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏర్నేన జ్యోతి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు శిమ్మ రుద్రవేణి, వస్తాది సత్యవతి, రెడ్డి గిరిజ, పావని, నరసమ్మ, ఏఎన్‌ఎం రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెయిన్స్‌లో మెరిశారు



సంధుల ధీరజ్ బి.సాయి యశ్వంత్ పి.రుక్మిణి సనపల రాఘవేంద్ర

శ్రీకాకుళం అర్బన్: జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ఫలితాలలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. తాజాగా వెలువడిన ఈ ఫలితాలలో పెద్దింటి సాయి రుక్మిణి ఆలిండియా ఓబీసీ కేటగిరిలో 1077వ ర్యాంక్, బొడ్డు సాయి యశ్వంత్ 2289వ ర్యాంక్, సంధుల ధీరజ్ 2400, సనపల రాజా రాఘవేంద్ర 3,053వ ర్యాంక్ సాధించారు. శ్రీకాకుళం శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సైతం తమ హవా కనబరిచారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం బి.నర్సునాయుడు, డీన్ కె.మురళీధర్, ఐఐటీ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ లు విద్యార్థులు ర్యాంక్‌లు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే నారాయణ విద్యాసంస్థల నుంచి నార్త్ కోస్టల్ డీజీఎం డి.హనుమంతురావు, డీన్ ఆర్.మణికుమార్, అసిస్టెంట్ డీజీఎం బి.తిరుపతిరావు, ఏజీఎం కె.గంగాధర్, ప్రిన్సిపాల్ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారిని తీర్చిదిద్దిన అధ్యాపకులను అభినందించారు.

రణస్థలం: రణస్థలంకు చెందిన ముల్లు రోణిత్రం నాయుడు జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ కేటగిరీలో 2282 ర్యాంకు సాధించాడు. ఓబీసీలో 414వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు జి.సిగడాం ఎంఈఓగా, తల్లి మోహిణికుమారి చాకిపల్లి హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

శ్రీనివాసా గోవిందా..



నారాయణ తిరుమలలో వేంకటేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్ : పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం అష్టోత్తర శత నామాలతో పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశేష అర్చనలు జరిగాయి. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



శ్రీకాకుళం కల్చరల్: కూడలి వద్ద ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు



రణస్థలం: పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో శనివారం ఏసు క్రీస్తు పునరుత్థానం పురస్కరించుకొని 'రన్‌ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్, జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం, సీనియర్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కమిటీల ఆధ్వర్యంలో క్రిస్టియన వర్షిప్ సెంటర్ వద్ద ర్యాలీ ప్రారంభించారు. ఏడురోడ్లు కూడలి, డే అండ్ నైట్ కూడలి, రైతుబజారు మీదుగా చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి వరకు కార్యక్రమం కొనసాగింది. క్రీస్తు సందేశాలను వివరించారు. కార్యక్రమంలో బిషప్ కె.విశ్వాసరావు, బిషప్ ఎ.శామ్యూల్ మోజెస్, బిషప్ కె.సుజ్ఞానరావు, రెవ.గోడి జోసెఫ్ డానియల్, రెవ.జె.జీవన్, పాస్టర్ సీహెచ్ ప్రేమ్‌కుమార్, రెవ కె.జాన్‌బాబు, రెవ కె.డానియేలు, ఎం.శారా, నవీన్‌కుమార్, రాజేశ్వరరావు, యేసుదాస్, గురుమూర్తి, జాన్ నేహమ్యా పాల్గొన్నారు. – రణస్థలం: మానవాళి సంక్షేమం కోసం ప్రేమ, కరుణ, క్షమాపణ వంటి గొప్ప సద్గుణాల్ని ఏసు బోధించారని పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడు ఎం.తిమోధి, గౌరవాధ్యక్షుడు సీహెచ్ రూబెన్ అన్నారు. ఏసు క్రీస్తు మరణం, పునరుత్థాన వేడుక సందర్భంగా రణస్థలం డబ్ల్యూ ఎంఈ చర్చి నుంచి థియేటర్ కూడలి వరకు రణస్థలం, లావేరు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి ఎం.ఇశ్రాయేలు, కోశాధికారి వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

రణస్థలం : చిల్లపేట రాజాం పంచాయతీలో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్రా– స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కంబపు నర్సింహులుపై టీడీపీ నాయకుడు చిల్ల శ్రీనివాసరెడ్డి చిందులు తొక్కారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు గ్రామంలోనే ఉంటూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలుచేపట్టారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దశ్యం

రణస్థలం: భూసార పరీక్షల ద్వారా పంటకు అవసరమయ్యే ప్రధాన, సూక్ష్మపోషకాల స్థాయిని గుర్తించి అందుకు తగ్గ పంటలు వేసి మేలైన దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. సంచాం గ్రామంలో మీసాల హేమలరావు పొలంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల రసాయన ఎరువులపై అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులు వాడేందుకు వీలు కలుగుతుందన్నారు. ఏరియా మేనేజర్ పతివాడ తవిటినాయుడు మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యమే కాక భూసారం కూడా క్షీణిస్తుందన్నారు. భూసార పరీక్షల వనరుల కేంద్రంలో సుమారు 13 అంశాలను పరీక్షించి నివేదిక అందిస్తున్నామని, జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, డి.శ్రీనివాసరావు, గొర్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



శ్రీకాకుళం రూరల్: గూడెంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో స్వచ్ఛతా ర్యాలీ



జి.సిగడాం: వాండ్రంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని వక్తలు పేర్కొన్నారు. పొన్నాడ గ్రామంలో సచివాలయ సిబ్బంది, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వేతనదారులు కలిసి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు.

జి.సిగడాం: అందరి సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు అన్నారు. శనివారం వాండ్రంగిలో సర్పంచ్ సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బూరాడ శ్రీదేవి, బూరాడ వెంకటరమణ, ఏఈఈ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, వీఆర్ఓలు శివనారాయణ, భూపతి నర్సింగరావు, ఏఎన్ఎం అన్నపూర్ణ, బొట్ల భాస్కరరావు, సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. రణస్థలంలోని స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండల కేంద్రం లావేరులో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మురపాకలో ఎంపీడీఓ పి.వెంకటరావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠకులు, విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి అన్నారు. గూడెం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీబీ రజిని, మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.